# చీరెకు రంగు

"మీరు ఏమీ పనిలేకుండా కూర్చున్నట్లున్నారు. ఇల్లా వచ్చి యీ నిచ్చెన కొంచెం పట్టుకోండి. ఆ చీర ఆరవేస్తాను" అన్నది కాంతం.

అప్పుడే ఏదో వ్రాయాలని కాగితం కలం తీసుకొని కూర్చున్నాను, ఇంతలోనే యీ సమను. తొందరపనిమీద పోతున్న సమయంలో యిటువంటి సమనులు వస్తూ వుంటవి.

బి.ఏ. క్లాసు పరీక్ష రోజున తొమ్మిదన్నరవరకూ పుస్తకాలన్ని తిరగవేసి పది నిమిషములలో భోజనంచేసి, కాలేజీకి హడావుడిగా పరుగెత్తవలెనని వీధి గుమ్మంలోకి కాలుపెట్టేసరికి వెనుకనుంచి "ఏమండోయి మాట" అని పిలుపు వచ్చింది. అది పెడచెవిని బెట్టి పోతుంటే "మిమ్మలినే, ఏమిటా వెళ్ళటం!" అని మృదువైన చీవాట్లు వినిపించినవి. ఏదైనా పుస్తకంగాని, కలంగాని మరచిపోయినానేమోనని వెనుకకు తిరిగి చూచేసరికి "పిల్లకు రెండు రోజులనుంచీ ఒంట్లో సరిగాలేదు. దుంపరాష్ట్రం, వాము, జీలకఱ్ఱ –" అని యేమేమో చెప్పింది. "చెప్పటానికి యిదా నీకు మంచి సమయము!" అని విసుక్కొని వెళ్ళిపోయినాను. అట్టి విషయములో ఏదో వ్రాసుకోవలెనని కాగితాలు ముందు వేసుకోగానే కాంతం నన్ను పిలిచింది అనటంలో విపరీతం యేమీలేదు. నేను యీరోజు వినిపించుకోనట్లు నటించాను. ఈయుపాయం నీకు యెట్లా తెలిసింది అని అడుగతారేమో! ఆంగ్ల సాంఘిక జీవనమును తెలిపే కథలవల్ల యీ రహస్యం గ్రహించాను. ఒకడికి హఠాత్తుగా చెవులు దిబ్బళ్ళు వేసి యేమీ వినిపించలేదు. భార్యతో ఆ విషయం చెప్పినాడు. భార్యకు చాలా కోపం వచ్చినది. ఎందుచేతనంటే ఇంట్లో ఫలాని వస్తువు కావలెను అంటే వినపడినాయి. కొత్తరకం గౌనులు వచ్చినవి ఒకటికొనండి అని నెత్తిన నోరుపెట్టుకొని అరిస్తే "ఇప్పుడు నాకేమీ ఆకలిగాలేదు. ఇంకో గంట వుండి భోజనం చేస్తాను. ఎందుకు నన్నింతగా బతిమాలుతావు" అని అంటాడు.

అందుకని భార్యకు కోపమూ, విచారమూ కలిగినవి.

"డాక్టరును పిలిచి రోగం నయం చేయవయ్యా అంటే దానంతట అదే నయమవుతుంది అని అతను అన్నాడు. ఎన్నాళ్ళో యీ గోల" అని ఆమె విసుక్కొన్నది.

ఆ మాటలు అతను విని డాక్టరువద్దకు వెళ్ళి తన రోగ లక్షణాలు చెప్పి యీ రోగం మందు లేకుండా నయం అవుతుందా అని అడిగాడు "అవుతుంది" అంటే మందు పుచ్చుకోడు గదా అని "మందు పుచ్చుకోకపోతే నయంకాదు ఇంటికి రమ్మంటావా మందు యివ్వటానికి" అని డాక్టరు అన్నాడు.

"ఎబ్బె! అక్కరలేదండీ, నయం అవుతుందేమోనని భయంవేసి నిజం తెలుసుకొందామని అడిగాను." అని యితను అన్నాడు. డాక్టరు తెల్లబోయినాడు, అని కథ వుంది.

అల్లాగే వినిపించనట్టు నటించటం అనే యుక్తిని ప్రయోగించాను కాని కాంతం, "సరే సరేలెండి – ఆనక వ్రాసుకోవచ్చు. ఇప్పుడు వచ్చిన తొందర యేమీ లేదు. కూడుకు వచ్చినట్లా, గుడ్డకు వచ్చినట్లా యెందుకు ఈ కథలు వ్రాయటం. ఇహానికి పరానికీ కాకుండా "సీత సమర్త" "సీమంతం" అటువంటి పాటలన్నా వ్రాయకూడదూ? పది పుస్తకాలు అమ్ముడుపోయినా నాలుగు డబ్బులన్నా వస్తవి లేవండి రండి" అని వూలచీవాట్లు రువ్వింది.

పుస్తకాలు ఒకవైపుకు నెట్టి కాగితాలు సర్దేసి వెళ్ళి నిచ్చెన పట్టుకొన్నాను. కాంతం చీర ఆరవేస్తున్నది.

"ఈ చీర మనము పోయిన సంవత్సరాదికి కొన్నాము"

"అవును."

"మళ్ళా సంవత్సరాది వస్తున్నది"

"అవును,"

"నాతోపాటు మాచమ్మ కొనుక్కున్న చీర చినిగిపోయి అప్పుడే రెండు నెలలు కావస్తున్నది"

"అవును"

"చీరలకు యిబ్బంది పడుతున్నాను"

"అవును"

"ఏమిటి నా ముఖం, అవును" క్రొత్త చీర ఎప్పుడు కొంటారు?"

"అదా నీ గొడవ" అని నేను చిరునవ్వుతో అన్నాను! రేపు పండుగకు చీర తెస్తానని, సమాధానపెట్టి మళ్లీ వ్రాసుకోటానికి వెళ్లాను.

మరునాడు బజారుకు వెళ్ళి పచ్చరంగు చీర ఒకటి కొన్నాను. పచ్చరంగు కంటికి ఎంతో ఇంపైన రంగు అని నా అభిప్రాయము. నాటకములలో కూడా శకుంతల, సీత, దమయంతి మొదలైన పాత్రలు ధరించేవాళ్ళు పచ్చచీరలు కట్టడం ప్రసిద్ధం. రంగుల తత్వాలను గురించి పాశ్చాత్యులు ఆలోచించి పసుపు ఆకుపచ్చ మొదలైన రంగులు కంటికి మంచివనీ, నరములకు బలము వస్తవని వ్రాశారు రంగునీళ్లతో వైద్యం చేసేవాళ్ళు పసుపు రంగులోనుంచి వచ్చిన సూర్యకిరణాలు శరీరానికి ఆరోగ్యమును ఇచ్చుననీ కఫవాతమును కొట్టి వేస్తవనీ వ్రాశారు.

ఇన్ని విషయములను ఆలోచించి కొంచెము ధర ఎక్కువగానే పెట్టి పచ్చచీర పట్టుకొని వచ్చాను. కాంతం పచ్చచీరను మెచ్చుకొంటుందో లేకపోతే నాకుమాత్రం ఈ చీర నచ్చలేదు. అంటుందో అని అనుకొంటూ గబ గబ మెట్లు ఎక్కడంలో కాలుజారింది. దెబ్బ అట్టే తగులలేదు. కాని మోకాలు చిప్పపైన చర్మముమాత్రం బెత్తెడు వూడింది. లేవలేక సొమ్మసిల్లి పడిపోయినాను.

కాంతం నా స్థితి జూచి లేవనెత్తవలసింది పోయి నవ్వటం మొదలుపెట్టింది. ఆ నవ్వటం నాకు కొంచెం వెగటుగా వున్నా ఆడదాని పైన విరోధం యెందుకని మెల్లిగా లేచాను. నేను లేచి నిలుచున్న తరువాత నవ్వుతెర కొంచెము ఆపుకొని "దెబ్బ తగిలిందా" అన్నది. పడితే దెబ్బ తగలదని అభిప్రాయం కాబోలు. కొంచెం విచారం అభినయించి అన్నది "కాస్త మెల్లిగానడిస్తే మీ సొమ్ము ఏమిపోయింది!"

"దానికేమిలే. ఈ కొత్తచీర చూశావా?"

"చీరకొన్నారా! ఏమిటి, అదా హడావుడి!" అని చీర తీసుకొని అటూ యిటూ తిప్పి "ఎంతకు కొన్నారు" అన్నది.

"పది రూపాయలు"

"మళ్ళా యిస్తే పుచ్చుకొంటారా?" అని అన్నది. అనేసరికి నాకాళ్ళు చల్లబడ్డవి. కళ్ళు తేలిపోయినవి. నోట మాట రాలేదు.

"అదేమిటి అట్లా చూస్తారు. వెఱ్ఱి చూపులు. పోనీలెండి. ఏదో వొకటి వుంటుంది." అని సమాధానపడ్డట్టు అన్నది.

పది రూపాయలు పెట్టి మనస్సుకు నచ్చిన చీర కొనటం, హడావుడిలో పడి మోకాళ్ళు విరగటం, ఇంతకు ఆవిడకు ఆ చీర నచ్చకపోవటం, మొదలైన విషయాలు తలుచుకొనేసరికి నాకు గుండెలు జారిపోయినవి.

"మళ్ళీ యిస్తే పుచ్చుకొంటారా అంటున్నావు ఏమిటి నీ వుద్దేశం?" అన్నాను.

"నా ఉద్దేశం ఏమిటిలెండి? రోజా రంగుచీర వుంటే బాగుండేది. పోనీలెండి. ఎల్లాగోలాగ జరుపుకొంటాను. మీకు బాధయెందుకు?"

ఇంతకూ కట్టుకొనే వాళ్ళకు ఇష్టం వచ్చినచీర కొని యివ్వటం కర్తవ్యం అని తోచింది. కాని ఆ చీర యిచ్చి వెయ్యటానికి ఏ మాత్రం వీలులేదు. కొంచెము సేపు ఆలోచించి, ఆ చీరకు రోజారంగు వెయ్యటానికి నిశ్చయించుకొన్నాను.

బజారుకు వెళ్లి రోజారంగు కొనితెచ్చాను. అవి గట్టిరంగులనీ, ఉతికినా పోవనీ అతడు నమ్మకంగా చెప్పినాడు. జర్మనీ రంగులు గదా అతడు చెప్పినది నిజమే అయి వుంటుంది అని ఆలోచించి అది కొని పట్టుకొచ్చాను.

కాంతం "నేను చీరకు ఆ రంగు వేసుకుంటాలెండి. మీరు వెళ్ళండి" అన్నది. ఆ చీరకు రంగు నేనే కొత్త పద్ధతుల ప్రకారం వెయ్యాలని సరదా గలిగి కాంతాన్ని వద్దని పంపేశాను.

రంగులు వేసే పద్ధతి అని ఇంగ్లీషులో వున్న పుస్తకమును కొని జాగ్రత్తగా చదివి ఆ ప్రకారం చేయటానికి ఉపక్రమించాను.

ఆ పుస్తకంలో చెప్పిన ప్రకారం తొట్టిలో వేడినీళ్ళు పోసినాను. అందులో రంగు కలిపినాను. నీళ్ళు రక్తంలాగ ఎఱ్ఱపడ్డవి. అందులో బట్ట పడవేసినాను. బట్ట నీళ్ళలో పూర్తిగా మునిగి ఉండవలెను. ఏ భాగమైతే మునిగియుండదో ఆ భాగము పైన రంగుపడదు" అని వ్రాసి వుంది. అందుచేత బట్ట అంతా నీళ్ళలో ముంచి వుంచాలని ప్రయత్నం చేశాను.

కాని ఎంత నొక్కిపట్టినా బుడగలాగ బట్ట పైకి తేలటం మొదలుపెట్టింది. మధ్య నొక్కిపెడితే రెండువైపులా పెద్ద గాలిబుట్టలలాగ బుడగలు తేలినవి. ఏమి చేయటానికి తోచలేదు. బట్ట కొంచెం పైకి కట్టుకొని తొట్టిలోకి దిగినాను. బట్ట కాళ్ళతో మర్దించాను, కాని ఏమీ లాభం కలుగలేదు.

"ఎందుకు వచ్చిన అవస్థరా ఇది, కాంతాన్నే చేయమంటే పోయేది. నా నెత్తిపైన ఎందుకు పెట్టుకొన్నాను" అని కొంచెం విచారపడ్డాను. అప్పుడు ఉపాయం తోచింది. చొక్కాతీసి వేసి ఆ చీరపైన నిలువుగా పండుకొని రెండుచేతులు క్రిందికీ బట్టలాగుకొన్నాను. అప్పుడు బట్ట నీళ్ళలో పూర్తిగా మునిగినది. కాని నేను లేస్తే బట్ట బుడగలాగ చివ్వున లేచేటట్లు వుంది. అందుకని ప్రాణాలు బిగబట్టుకొని అక్కడే పడుకొన్నాను.

ఇంతలోనే ఎక్కడినుంచో వచ్చింది మా కాంతం. నన్ను ఆ స్థితిలో చూచి నవ్వడం మొదలుపెట్టింది. పోనీ నవ్వితే నవ్విందని ఊరుకొంటే పైగా తమ్ముణ్ణి, పనిచేసేదాన్ని పిలవటం మూలాన నాకు కొంచెం కోపంవచ్చి "ఏమిటా వెర్రికేకలు. బట్టలకు రంగు వేస్తున్నాను. మరేమీ ఉపద్రవం జరగటంలేదు నీవు వెళ్ళిపో" అన్నాను.

వాళ్లంతా కలిసి కొంచెంసేపు నవ్వారు. కాంతం అతికష్టంమీద నవ్వు తెర ఆపుకొని "ఏమిటి యీ స్థితి?" అని అడిగింది. "ఏమీ లేదు" బట్టలు లోపల అణిగి వుండటానికి ఈ వుపాయం చేశాను" అని అనేసరికి ఆవిడ మరీ విరగబడి నవ్వింది.

"బట్టముందు మంచినీళ్ళలో తడిపి రంగునీళ్ళలో వెయ్యకపోయినారా" అన్నది నవ్వుతెర కొంచెం ఆపుకొని.

ఆ మాత్రం ఉపాయం తోచకపోయెనే అని నాకు విచారం కలిగింది కాని ఆ భావాన్ని ప్రకటించక "అంతమాత్రం తెలియక కాదు అవన్నీ పూర్వపు పద్ధతులు. క్రొత్త పద్ధతుల ప్రకారం పనిచేస్తున్నాను" అన్నాను.

తరువాత రెండు మూడు రోజుల వరకూ ఆ రంగు నా వంటిపైనే వుంది. సోడా ఉప్పుతో కడిగినా నలుగు పెట్టుకున్నా పోలేదు. ఎవరైనా ఒంటిపైన రంగుచూచి నవ్వితే, నాభార్య "అది కొత్త పద్ధతుల ప్రకారం రంగు వేయటం మూలాన వచ్చిన ఫలితం లెండి" అని వేళాకోళం చేస్తుండేది.

*(ఆంధ్రభారతి మాసపత్రిక, జనవరి 1927)*